క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 42 మంది ఎంపిక



రోగి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

రాజాం: పట్టణ పరిధిలోని మెంతిపేటలో సత్యసాయి సేవా సమితి సుందరం మందిరం వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. సుందరం మందిరం, విశాఖ శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన ఈ శిబిరానికి హాజరైన 98 మంది కళ్లను వైద్య సిబ్బంది తనిఖీ చేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 42 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని శంకర్ ఫౌండేషన్ విశాఖపట్నం ఆస్పత్రి కో–ఆర్డినేటర్ రాజు తెలిపారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సుందరం మందిరం కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనాల సేకరణలో ఏవో మురళీకృష్ణ, సిబ్బంది

రేగిడి: మండలంలోని కోడిశ గ్రామ పంట పొలాల్లో మట్టి నమూనాల సేకరణ ఆదివారం చేపట్టారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మట్టి నమూనాల ఆధారంగా భూసార పరీక్షలు చేసి, నేలసారవంతమా కాదా అనే విషయం తెలుసుకోవచ్చన్నారు. అలాగే నేలసారం బట్టి, పంట వేసుకుని తద్వారా నాణ్యమైన పంట, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఏ నేలలో ఏ పంట వేస్తే మంచిదన్న విషయం తెలుస్తుందన్నారు. భూసార పరీక్షల ద్వారా ఎరువుల వినియోగం కూడా తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం యాంత్రీకరణ ఉపకరణాల వినియోగం, లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శరత్‌బాబు, సూర్యనారాయణ, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లతో శిక్షణార్థులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో మష్రూమ్ తయారీలో శిక్షణ పొందిన 35 మంది యువతీ, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్లు ఆదివారం అందజేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పర్యవేక్షణలో కలెక్టర్, నీతి అయోగ్ సంయుక్తంగా అనూష ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి గోవిందరావు, బొత్స గురునాయుడు మెమోరియల్ సొసైటీ మేనేజర్ కె.రవికిరణ్, మండల కో–ఆర్డినేటర్ ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదువంటే మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, కాసేపు మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం మన సొంతమవుతుందని, అనేకానేక కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. పుస్తక పఠనంతో పాటు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వంపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు.

తాగునీరు సరఫరా

వంగర: మండలంలోని వివిధ గ్రామాలకు తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా తాగునీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. వేసవి కారణంగా చెరువులు ఎండిపోవడంతో ప్రజలు, పశువులు దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో మండలంలోని వీవీఆర్‌పేట, రాజులగుమ్మడ, బంగారువలస, కొప్పరవలస, కె.కొత్తవలస, మద్దివలస, కొట్టిశ, లక్ష్మీపేట గ్రామాలకు కాలువ ద్వారా తాగునీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు.

ఆలయానికి ఏసీ బహూకరణ

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానానికి రూ. 34 వేల విలువైన ఏసీని దాతలు బహూకరించారు. పట్టణానికి చెందిన మిరియాల జయబాబు, చిన కనకరత్నం కుమారుడు, కోడలు క్రాంతికుమార్, ప్రణాళిని ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద్), వైస్‌చైర్మన్ సూరు కుమార్‌లకు ఆదివారం అందజేశారు.

ప్రజాప్రభుత్వానికి పట్టంకట్టండి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



సురవరంలో ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు విజయోస్తు అని తిలకం దిద్దుతున్న మహిళ

సంతకవిటి: రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తూ ప్రజాప్రభుత్వంగా పేరొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లోనూ పట్టంకట్టాలని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సురవరం, మామిడిపల్లి, పుల్లిట, బొద్దూరు, తలతంపర, బిల్లాణి గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు వలంటీర్ వ్యవస్థ ద్వారా నిష్పక్షపాతంగా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని ఇదే జగనన్న సుపరిపాలనకు నిదర్శనమన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలు బాగుండాలంటే వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జి.స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ పండు పాపారావు, సురవరం సర్పంచ్ ఘంటా షణ్ముఖరావు, పుల్లిట సర్పంచ్ సానా జగదీష్, బొద్దూరు సర్పంచ్ గేదెల బాబూరావు, మండల వ్యవసాయ శాఖ సలహా మండలి అధ్యక్షుడు వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ఓటేయండి

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఓటేసి, గెలిపించాలని వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక పట్టణంలోని 20వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం చేపట్టిన ఆయనకు పట్టణవాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాలతో పాటు అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, ఆయన హయాంలోనే రాష్ట్రం సుభిక్షమన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని అర్హులై ఉంటే చాలు సంక్షేమ ఫలాలు వారి వద్దకే వచ్చి చేరుతున్నాయన్నారు. అభివృద్ధి పనులు కూడా అన్ని ప్రాంతాల్లో గతంలో కన్నా బాగా జరిగాయన్నారు. బొబ్బిలిలో సైతం టీడీపీ హయాంలో కన్నా వైఎస్సార్ సీపీ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం ఎక్కువ జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, ఎమ్మెల్యేగా మరోసారి పోటీ చేస్తున్న తనను గెలిపించి, సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాన రమాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్ తూముల అచ్యుతవల్లి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మి మోసపోవద్దు..

బాడంగి: ఎన్నికల వేళ టీడీపీ నేతల మాయమాటలు నమ్మి, మోసపోవద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని డొంకినవలస, వీరసాగరం, పిండ్రంగివలస, డొంకినవలస స్టేషన్, పెదపల్లి, తెంటువలస, లక్ష్మీపురం గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యేకు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, తమ పాలనపై గొప్ప నమ్మకంతోనే తమ నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరుతున్నారని, ఇంత దమ్మూధైర్యంతో ఓట్లు అడిగిన ముఖ్యమంత్రిని తానెన్నడూ చూడలేదన్నారు. మనకు మంచి చేసిన వైఎస్సార్‌సీపీకి, సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలవాలని, మే 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, కంటి వైద్య నిపుణుడు పోల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: డొంకినవలసలో ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

టీడీపీవి హత్యా రాజకీయాలు..



బాడంగి: లక్ష్మీపురంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించి, మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళ ఎలాగైనా అధికారంలోకి రావాలని టీడీపీ హత్యా రాజకీయాలకు తెరతీసిందని, ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, మండల ఇన్‌చార్జ్ మరిపి శంకరరావు, ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, నాయకులు తెంటు మధు, గండి శారదా శంకరరావు, బంకురు పెద సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామ జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన శుభం సిల్వర్ ప్యాలస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని రిటైర్డ్ మున్సిపల్ ఆర్డీ వడ్డపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు యువత స్పందించి, ముందుకురావడం అభినందనీయమన్నారు. కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు వేసవి తీరేవరకు కొనసాగించాలని కోరారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో భగవాన్ సత్యసాయి బాబా భక్తులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



రాజాం సిటీ: చలివేంద్రం వద్ద మజ్జిగ తాగుతున్న ప్రజలు

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా బాలరాజు

బాడంగి: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా మండలంలోని హరిజన పాల్తేరుకు చెందిన యజ్జల బాలరాజును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈయన శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు. ఈయన ప్రస్తుతం రాష్ట్ర క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగాను, బిషప్ కౌన్సిల్ అధ్యక్షుడిగానూ ఉన్నారు. ఆయనకు ఈ పదవి ఇచ్చినందుకు గాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, జిల్లాకు చెందిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



తారాపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ గ్రామంలో పర్యటించిన జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్‌లు వారికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేస్తున్న శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బెల్లాన చంద్రశేఖర్‌లను గెలిపించుకుని, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కూల్ డ్రింక్స్ పంపిణీ వాస్తవమే!

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామ ఉపాధి హామీ పనుల వద్ద వేతనదారులతో చంద్రబాబు పుట్టినరోజు కేక్ కట్ చేయించడం, వారికి కూల్ డ్రింక్‌లు పంపిణీ చేయడం వంటివి వాస్తవమేనని, ఇది ఓటర్లను మభ్యపెట్టే కార్యక్రమమని డ్వామా అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఈ నెల 20వ తేదీన పనుల ప్రదేశంలో ఈ తంతు జరగగా సాక్షి దినపత్రికలో ఈ నెల 21వ తేదీన ఫీల్డ్ అసిస్టెంట్ అత్యుత్సాహం అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఎన్నికల ఆర్వో జోషఫ్ రాజాం డ్వామా అధికారులకు వివరణ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు రాజాం ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు, ఏపీవో సాయిరాంలు బొద్దాం ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణను కార్యాలయానికి పిలిచి, ఆరాతీశారు. ఆ సమయంలో తాను అక్కడ లేనని ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ ఇచ్చి, తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే కేక్ కటింగ్ సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ భార్య అక్కడే ఉండి, కేక్ కట్ చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయాన్ని అధికారులు గట్టిగా అడగ్గా తన భార్య, కుటుంబ సభ్యులు ఆ సమయంలో అక్కడే ఉన్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ అంగీకరించారని ఎంపీడీవో విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా, కూల్ డ్రింక్స్ పంపిణీ బొద్దాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దశరథ చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని ఎంపీడీవో తెలిపారు. ఈ వ్యవహారాలపై సంబంధిత వ్యక్తులపై కేసు కూడా నమోదు చేశామన్నారు. ఎన్నికల అధికారులు సైతం ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నారని సమాచారం.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



వంగర: మద్దివలసలో ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, గణేష్ బెనర్జీకి ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

వంగర: మండలంలోని మద్దివలస గ్రామంలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ, వైఎస్సార్ సీపీ నేత గణేష్ బెనర్జీ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తమకు, పార్టీ నాయకులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు.

వలంటీర్ల రాజీనామా

రామభద్రపురం: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని జన్నివలసకు చెందిన ఏడుగురు వలంటీర్లు ఆదివారం రాజీనామా చేసి, తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఈశ్వరమ్మకు అందజేశారు. మండలంలో మొత్తం 294 వలంటీర్లు ఉండగా, ఇప్పటివరకు 154 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.



రాజీనామా పత్రాలు చూపిస్తున్న జన్నివలస గ్రామ వలంటీర్లు

‘సిద్ధం’ సభను విజయవంతం చేయండి

చీపురుపల్లి: జిల్లా కేంద్ర సమీపంలోని చెల్లూరు వద్ద ఈ నెల 23న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించనున్న సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మీసాల వరహాలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు సభ జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులుగా జరుగుతున్న సిద్ధం బస్సుయాత్రకు విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు, తదితరులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కందుల కృష్ణ, జనార్దన్, బీటీఆర్, యాదవ్, రొబ్బి చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుకతో తీరిన చదువు బెంగ

- విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వం చర్యలు
- విద్యాసంవత్సరం ఆరంభంలోనే జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ
- సకాలంలో సదుపాయాల కల్పనతో చదువుపై పిల్లల్లో పెరిగిన ఆసక్తి
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన పిల్లల హాజరు శాతం



బాడంగిలో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు(ఫైల్)

రాజాం: ప్రభుత్వ పాఠశాలలంటే నిన్నమొన్నటి వరకు అందరికీ చిన్నచూపే.. అందులో చదువుకోవడమంటే చాలామంది స్థాయి తక్కువని భావిస్తే.. మరికొంత మంది అక్కడ ఉన్న వనరులనే సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు పొందిన సందర్భాలు కూడా ఉన్నాయి.. ఇదిలా ఉంటే చక్కగా చదువుకోవాలనే ఆసక్తి ఉన్న పేదింటి విద్యార్థులకు సరైన పుస్తకాలు, అభ్యసన సామగ్రి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ కొరతను పూడ్చలేక చదువు మానేసిన విద్యార్థులు కొంతమంది అయితే, చదువుకు పెట్టుబడి పెట్టలేక పిల్లలను బడికి పంపకుండా వదిలేసిన తల్లిదండ్రులు మరికొంతమంది. ఇలాంటి అన్ని సమస్యల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గట్టెక్కించింది. ఐదేళ్లలో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్ది, బడికి వెళ్లాలనే ఆసక్తిని పిల్లల్లో కల్పించింది. అలాగే ఉపాధ్యాయులకు బోధనా సామగ్రి, పిల్లలకు అభ్యసన సామగ్రిని కూడా అందించింది. ఫలితంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. 2019కి ముందు రాజాం నియోజకవర్గంలో 15 వేల మంది విద్యార్థులు 1 నుంచి 10వ తరగతి వరకు చదివితే ఇప్పుడు ఆ సంఖ్య 21 వేలకు చేరింది. వీరందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు రూపంలో బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, కుట్టుకూలితో సహా మూడు జతల యూనిఫాం క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్‌తో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరీలు అందించారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నాలుగు దశల్లో నాణ్యత పరిశీలించి, గుడ్ సిగ్నల్ ఇచ్చింది. ప్రతీ విద్యార్థికి అందజేసే ఈ కిట్ విలువ రూ.2,400 ఉంటాయి. గతంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నాలుగైదు నెలలు దాటితే గానీ కనీసం పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేకపోయేది. జగనన్న ప్రభుత్వం మాత్రం ఇప్పుడు స్కూళ్లు తెరిచిన రోజే జగనన్న విద్యాకానుక కిట్లు ఇస్తోంది. విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దే క్రమంలో ఇంగ్లిష్ మీడియం కూడా ప్రవేశపెట్టి, పక్కాగా అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని మేధావులు సైతం మెచ్చుకుంటుండడం విశేషం.

నాడు ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం..



ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సకాలంలో పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు ఇస్తుండడంతో మా పిల్లలు ప్రతిరోజూ స్కూల్‌కు వెళ్తున్నారు. గతంలో ఈ పుస్తకాలు స్కూల్లో ఇవ్వక, బయట బుక్‌స్టాపుల్లో దొరక్క చాలా ఇబ్బందులు పడేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది.

– టి.చంద్రకళ, విద్యార్థి తల్లి, లక్ష్మీపురం, రాజాం మండలం

పుస్తకాల కొరత ఊసే లేదు..



విద్యార్థులకు ఉపయోగపడే అభ్యసన సామగ్రి జగనన్న విద్యాకానుక కిట్‌లో ఉంటున్నాయి. వీటితో విద్యార్థులు చాలా చక్కగా చదువుకోవడంతో పాటు సకాలంలో స్కూళ్లకు వెళ్తున్నారు. ఇంటి వద్ద పుస్తకాల కొరత ఉందనే ఊసే లేదు. బాగా చదివి మంచి మార్కులు కూడా సంపాదిస్తున్నారు.

– పి.పద్మావతి, విద్యార్థి తల్లి, ఎం.ఎస్.ఆర్.పురం, వంగర మండలం

జగనన్న విద్యాకానుక.. విద్యార్థులకు వరం..

తెర్లాం: జగనన్న విద్యాకానుక పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు వరంలా మారింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన ఈ పథకంతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు వచ్చాయి. ఒకప్పుడు కేవలం ధనవంతుల పిల్లలకు మాత్రమే ఉండే స్కూల్ బ్యాగ్, యూనిఫాం, షూ, సాక్సులు, ఖరీదైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇప్పుడు జగనన్న పుణ్యమా అని పేద విద్యార్థుల సొంతమయ్యాయి. కూలి పనులు చేసుకుంటూ తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చదివించుకోలేని ఎంతోమంది నిరుపేదల తల్లిదండ్రులు ఆశలను సీఎం జగన్ నాడు–నేడు, జగనన్న విద్యాకానుక పథకాల ద్వారా నెరవేర్చారు. తెర్లాం మండలంలో 68 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 4,604 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ జగనన్న విద్యాకానుక ద్వారా ఏటా స్కూల్ బ్యాగ్, షూ, సాక్సులు, బెల్ట్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నారు. వీటితో నిరుపేద విద్యార్థులు సైతం ధనవంతుల పిల్లలకు తీసుపోమంటూ చక్కగా చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగనన్న విద్యాకానుక పథకం తమకు వరంలాంటిదని విద్యార్థులు అంటున్నారు. వారంతా సీఎం జగన్ మామయ్యకు జేజేలు పలుకుతున్నారు.

బాడంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 3,543 మంది విద్యార్థులకు ఏటా జగనన్న విద్యాకానుక కింద నాణ్యమైన స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్ట్, డిక్షనరీలు అందిస్తున్నారు. దీంతో రూపాయి ఖర్చు లేకుండా తమ పిల్లల చదువు చక్కగా సాగిపోతోందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూపాయి ఖర్చు లేదు..



నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరినీ స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ హయాంలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా స్కూల్ బ్యాగ్, యూనిఫాం, షూ, సాక్సులు, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అన్నీ ఉచితంగా అందజేస్తున్నారు. జగనన్నకు మేమెంతో రుణపడి ఉంటాం.

– శనపతి సత్యవతి, రంగప్పవలస గ్రామం, తెర్లాం మండలం.